# గిరిధర్ వాణి సత్యవర్ష

ప్రచురణకర్త : ముద్రించువారు

**శ్రీ బి. గిరిధర్ సింగ్**

గిరిధర్ వాణి సత్యవర్ష

9-62-77, డ్రైన్ స్ట్రీట్,

ఇస్లాంపేట, విజయవాడ -1

ఫోన్ : 0866 - 3294745

సంప్రదించవలసిన నెంబర్ :

08645 - 273373

## ఈ సంచిక ప్రాప్తిస్థానము

Copy Rights Reserved

**ప్రింటింగ్ చార్జ్ : 30**

పోస్టేజీ అదనం

**శ్రీ బి. గిరిధర్ సింగ్,**

**గిరిధర్ వాణి సత్యవర్ష 9-62-77,**

**ఇస్లాంపేట, విజయవాడ -520 001. ✆ : 0866-3294745, 6545745**

**గిరిధర్‌వాణి ఆనంద నందనం, తాడేపల్లి, ఫోన్ : 0866 - 3294745**

**website : www. appgv.org**

**email : info @ appgv.org** **appgv.email @ gmail.com**

# ముందుమాట

లోక కళ్యాణాన్ని కోరుకునే "గిరిధర్ వాణి" ఆ పని చేయటానికి "గిరిధర్‌వాణి ఆనందనందనం" ను ఏర్పాటు చేసింది. ఈ ఆనంద నందనం విజయవాడ సమీపంలోని తాడేపల్లి వద్ద కలదు. ఇచ్చట ప్రతి గురు, ఆది వారాలలో గిరిధర్‌వాణి సత్యవర్ష అనే కార్యక్రమం జరపబడుతోంది. ఈ సత్యవర్షలో ప్రతి జీవికి, జీవి గురించిన సత్యాలు తెలియచేస్తోంది గిరిధర్‌వాణి. జీవి అసలు ఏ పనిమీద జన్మకి వచ్చింది?

ఆ పనిని ఎలా విజయవంతంగా పూర్తి చేసుకోవాలి?

భగవంతుడు అంటే ఏమిటి?

భగవంతుడిని ఎలా ఆస్వాదించాలి?

భగవంతుడితో ఉంటూ సంసారంలో ఎలా మెలగాలి?

సమాజంలో ఎలా ప్రవర్తించాలి? సమాజంతో ఎలా ప్రేమగా ఉండాలి?

లాంటి అనేక భగవత్ విషయాలను, అందరికీ అర్థమయ్యేలా ఏ సాధనా లేకుండానే బోధిస్తోంది గిరిధర్‌వాణి. ఈ సత్యవర్షలో అనేకమంది తడిచి ఆనందిస్తున్నారు. ధన్యులు అవుతున్నారు. గిరిధర్‌వాణి వర్షించిన సత్యాలలోని కొన్నింటిని పుస్తకాల రూపంలో పొందుపరచటం జరిగింది. అందరూ వీటిని పదే పదే చదివి, అన్వయించుకుని, ఆనందించాలి అన్న ఉద్దేశంతోనే ఈ సత్యాలను పుస్తకరూపంలో వెలువరించటం జరుగుతోంది. వీటిని అందరూ చదువుతూ ఆనందిస్తూ తరించాలని కోరుకుంటూ....

**–గిరిధర్‌వాణి ఆనందనందనం**

# పుస్తక పరిచయం

ప్రతీ జీవి భ్రమలు లేని అసలైన మూలపు నివాసంగా ఎలా మారవచ్చో ఈ పుస్తకంలో గిరిధర్‌వాణి విశదీకరించారు. 2010 వ సంవత్సరంలో (22-07-2010 నుండి 29-07-2010 వరకు) జరిగిన గురుపౌర్ణమి ఉత్సవాల సందర్భంగా గిరిధర్‌వాణి చేసిన ప్రసంగాల సారాంశమే ఈ పుస్తకము.

– గిరిధర్ వాణీ ఆనందనందనం.

# మందిరము

**- కేవలము యజమాని కొరకు**

మనమందరమూ ఏ భ్రమలు లేని మూలమును మన యజమానిగా స్వీకరించాము. వారి ప్రభావాన్ని మాత్రమే మన మీద ఒప్పుకుంటూ మనకు వున్న నితాంత భ్రమల నుండీ బయటపడాలని నిర్ణయించుకున్నాము. ఎందుకంటే ఏ భ్రమలూ లేని స్వచ్ఛమైన జీవిలోనే యజమాని నివసిస్తారు. నిజానికి మన భగవంతుడు సర్వాంతర్యామి అన్నింటా అంతటా వ్యాపించి వున్నారు. అయితే మనకి వున్న నితాంత భ్రమల వల్ల వారి దర్శనాన్ని సాంగత్యాన్ని పూర్తిస్థాయి లో అనుభవించలేక పోతున్నాము. యజమానిని నిరంతరమూ కలిగి వుండి సాంగత్య భాగ్యాన్ని పొందాలంటే మనలో భ్రమలు వుండకూడదు. ఏ భ్రమలూ లేని జీవిలోనే యజమాని యొక్క నెలవు పేరుకు మాత్రమే కాక పూర్తి స్థాయిలో వుంటుంది. అందుకే ఏ భ్రమలూ లేని జీవే భగవంతుడు ఏ భ్రమలూలేని జీవి సమస్తమే యజమానికి మందిరము.

ఈ గురు పౌర్ణమికి మన యజమానికి మనమే మందిరముగా వుండాలంటే ఎలాగో తెలుసుకుందాం! భ్రమలు లేని జీవి యొక్క సమస్తమే యజమానికి మందిరము అని తెలుసుకున్నాం కాబట్టి మనకున్న నితాంత భ్రమలను పోగొట్టుకొనే ప్రయత్నం చేద్దాం! భ్రమ అంటే లేని దానిని ఉన్నట్లుగా భావించటం. ఆ భావించిన దానినే నిజమని నిలుపుకుంటూ వుంటే ఎప్పటికీ నిజంగా వ్యవస్థితమవుతున్న సత్యాన్ని గమనించలేం ఆస్వాదించలేము. ఇలా లేని దానిని వున్నట్లుగా భావింపచేసే భ్రమల నుండీ బయట పడాలంటే జీవికి అవగాహన పూర్తిస్థాయిలో వుండాలి. ఇది భ్రమ ఇలా వుండకూడదు అని

వరుస బెట్టి భ్రమల గురించి చెప్పుకుంటూ పోతే ఎన్నో రోజులు గడిచినా పూర్తికాదు ఎందుకంటే జీవి చిక్కుకు పోయిన భ్రమల వలయం అంత చిక్కులతో వుంది. అందుకనే ఎలా వుండకూడదో చెప్పుకునే కన్నా ఎలా వుంటే మనం యజమానికి మందిరముగా మలచబడుతామో తెలుసుకుందాం! నిజం అన్నది, నిజంగా వ్యవస్థితము అవుతున్నది ఒక్కటే! అందుచేత ఆ ఒక్కదానిని గురించి తెలుసుకోవటం తేలిక. అదే లేనివి కోకొల్లలు వున్నాయి (భ్రమలు అనేకం) వాటి అన్నిటి గురించి మాట్లాడుకోవటం బహు కష్టతరమైనది! కాబట్టి ఉన్న ఒక్క నిజవస్తువు గురించి దాని ఆవాసముగా జీవి ఎలా మారగలదు అన్న విషయాల గురించి తెలుసుకుందాం!

ముందుగా మనలను భ్రమలను భ్రమల వలయం నుండీ బయట పడేస్తూ మందిరముగా మలస్తున్న మన యజమానికి కృతజ్ఞతలు, నమస్కారాలు తెలియచేసుకుందాం! ఏదైతే విషయాన్ని ఈ వారం రోజుల లో మనకు అవగాహన చేయిస్తున్నారో దానిని మనసా వాచా కర్మణా స్వీకరించటానికి సంసిద్ధంగా వున్నామని వారికి విన్నవించుకుందాం! ఎందుకంటే తెలియపరుస్తున్న విషయాన్ని స్వీకరించటానికి మన సంసిద్ధతను వ్యక్తం చేస్తే చాలు మిగతావన్నీ వాతంట అవే జరిగిపోతాయి. ఎందుకంటే చెప్పబడుతున్న విషయంను అన్వయించుకుని ఆస్వాదించటమే భగవంతుని ఉద్దేశము కాబట్టి వారి ఉద్దేశం నెరవేడానికి సమస్తమూ సమకూడి జరుగుతుంది కాబట్టి మనం ప్రత్యేకించి సాధన చేసి ఆచరణ చేయాల్సిన పనిలేదు. కేవలం వారి ఉద్దేశాన్ని ఫలింపచేసుకో వాటిని ఒక క్షేత్రములాగా మన సంసిద్ధతను వ్యక్తం చేసుకుంటే చాలు. అందుచేత వారు చెప్పబోతున్న విషయాన్ని స్వీకరించటానికి మనసా వాచా కర్మణా సంసిద్ధంగా వున్నామని మరోమారు యజమానికి విన్నవించుకుందాం! దీని ద్వారా ప్రయత్నం, సాధన, ప్రయాస, కర్మానుభవం అనే భ్రమల నుండీ బయట పడదాం!

భగవంతుడు చెప్పిన విషయాన్ని గుర్తుంచుకోవాలి దానిని పదే పదే మననము చేసుకోవాలి దానిని తప్పక సాధించి తీరాలి అనే ప్రయత్నంలో జీవి వుంటుంది. తప్పక సాధించాలి అనే ప్రయత్నంలో ఏదో ఒక సాధనా పద్ధతిని ఎంచుకుంటుంది. ఆ పద్ధతిలో వున్న ప్రయాసలను అధికమించటానికి తన అవగాహనతో ప్రయత్నిస్తుంది. సాధనలో వచ్చే బాధలకు విసుగు చెందుతుంది. సొంత మార్గములో సొంత అవగాహనతో చేసే పనుల యొక్క ఫలితాన్ని జీవే అనుభవించాల్సి వుంటుంది. ఇలా జీవి ప్రయత్నం, సాధన, ప్రయాస, కర్మానుభవం అనే నాలుగు గోడల మధ్య ఇరుక్కుపోతోంది. జీవి భగవంతుడి మందిరముగా మారాలంటే ముందు జీవిలో వున్న ఈ నాలుగు గోడలు సమూలంగా నిర్మూలించబడాలి.

ఇన్ని రోజులు మనకు యజమాని ఇక్కడ నేర్పిస్తున్నది అదే! భగవంతుడే అంతా చేసే వాడు అని గమనిస్తే (స్వధర్మము) జీవిలో ప్రయత్నం అనే గోడ నిర్మూలించబడుతుంది. భగవంతుడి చిత్తాన్ని అర్థం చేసుకుంటే (నిజం) సాధన అనే గోడ నిర్మూలించబడుతుంది. భగవంతుని యొక్క సహజ తత్వాన్ని అర్థం చేసుకుంటే (సహజత్వము) ప్రయాస అనే గోడ నిర్మూలించబడుతుంది. దేనిని పని చేయనీయాలో తెలుసుకుని దానిని పని చేయనించినప్పుడు (Let it work) కర్మనుభవం అనే గోడ నిర్మూలించబడుతుంది.

ఇలా ఇన్ని రోజులు పొందిన అవగాహన మనలో వున్న గోడలు నిర్మూలించబడటానికి ఉపయోగపడతాయి. అలాగే భగవంతుని కృపను, క్షమను, ప్రేమను, నీతి-నిజాయితీలను, ప్రసాదమును రుచి చూసిన రుచి చూస్తునే వున్న జీవిలో తిరిగి ఈ గోడలు లేచే ప్రమాదం వుండదు. మన యజమాని నేర్పించిన పరిశుద్ధతలో నిలిచి నిర్విషసుఖాన్ని, అనుసంధానాన్ని ఏ కొద్ది సేపో అనుభవించగల్గినా చాలు. జీవిలో ప్రాథమికంగా వచ్చే భ్రమల గోడలు మరల మరల రాకుండా వుంటాయి.

ఇలా ఇన్ని రోజులు మనకి యజమాని నేర్పించిన అవగాహన జీవిని భ్రమల వలయంలో నుంచీ బయటపడేస్తుంది. ఒకవేళ ఎవరికైనా నేను సరిగా నేర్చుకున్నానో లేదో నాలో నాలుగు గోడలు పోయాయో లేదో అన్న సంశయం వుంటే వారికీ ఒక ఉపాయం వుంది. అది ఏమిటంటే :- "భ్రమలు లేని నా యజమాని నన్ను కూడా భ్రమలు నుండీ బయటపడేసి సర్వ పరిపూర్ణునిగా చేసి ఆయన మందిరంగా మార్చుకుంటారు" అని విశ్వసించి వారు చెప్పబోయే విషయాలు మనసా వాచా కర్మణా స్వీకరించటానికి సంసిద్ధతను వ్యక్తం చేస్తే చాలు, మనలో వున్న ప్రయత్నం, సాధన, ప్రయాస, కర్మానుభవం అనే గోడలు కూలిపోతాయి. యజమాని ఒక విషయం చెప్తున్నారంటే అది నాకు రావాలనే ఉద్దేశంతోనే నేర్పిస్తున్నారు అని నమ్మినప్పుడు అది తప్పక మనకు వస్తుంది అని విశ్వసించినప్పుడు మనలో ప్రయత్నం, సాధన, ప్రయాస, కర్మానుభవం మచ్చుకు కూడా వుండదు.

ఏదైనా కొత్తది నిర్మించబడాలంటే ఆ భూమిలో (క్షేత్రంలో) వున్న పాత వస్తు సముదాయమంతా నిర్మూలించి నేలను చదును చేయాలి కాదా! అలాగే మనలో యజమాని కొరకు మందిరము నిర్మించబడటానికి మనలో ముందుగా వున్న గోడలు (భ్రమలు) కూల్చబడాలి. ఈ రోజు మనము చేసింది అదే! నిరంతరం ఒకే విధంగా అలరారుతున్న (Uniform గా) యజమానికి మనమూ మందిరముగా వుండాలని అంటే మన సమస్తములోనూ యజమాని అలరారాలని తెలుసుకున్నాం. తెలుసుకున్న వెంటనే మందిరం నిర్మించటానికి నేలను చదును చేయటానికి పాత గోడలను కూల్చివేసాం మరోసారి గోడలను మొలకెత్త నీయకూడదని నిర్ణయించుకున్నాం. ఈ రోజు మందిరం నిర్మించడానికి కావల్సిన క్షేత్రము (భూమి) సిద్ధమైనది. మనము తప్పకుండా సంబరపడాల్సిన రోజు ఇది! మన యజమానికి కృతజ్ఞతలు, నమస్కారాలు తెలియచేసుకుంటూ సంబరం చేసుకుందాం! "ఇది మురిసిపోయి ఆ మురిపాన్నే కృతజ్ఞతా పూర్వకంగా యజమానికి సమర్పించుకుందాం!

2వ రోజు

నిన్నటి రోజు నేలను చదును చేసి మందిర నిర్మాణానికి అనువుగా చేసుకున్నాం కాదా! ఈ రోజు మందిర నిర్మాణానికి ముందుగా పునాది వేద్దాం! ఇప్పటి దాకా మన యజమాని మనకి నేర్పించిన ప్రతీ విషయం మన మందిరానికి పునాదే! ఇప్పుడా విషయాలన్నీ బట్టీ పట్టి గడ గడా చెప్పగల్గాలి అని కాదు యజమాని ఉద్దేశం వాటిని స్వీకరించి వుంటే చాలు. ఇప్పటిదాకా నేర్చుకున్న ప్రతీ విషయమూ మరోసారి నిజమేనని నిస్సందేహంగా ఒప్పుకుని స్వీకరిస్తే నేల చదును చేయబడినట్లే పునాది కూడా గట్టిగా ఏర్పడుతుంది.

మందిర నిర్మాణానికి కావల్సిన క్షేత్రము సిద్ధమయిందికదా ఇంక స్తంభాలను నిర్మించుకుందాం! మందిరపు మొదటి స్తంభం భగవంతుని మీద **"గౌరవము"** భగవంతుని రోజూ మేము గౌరవిస్తూనే వున్నాము అంటారేమో, మనకు తెలిసిన పద్ధతిలో మనకు తోచిన విధంగా భగవంతుని గౌరవిస్తున్నాము కానీ నిజానికి భగవంతుని ఎలా గౌరవించాలో తెలుసుకుందాం.

ఇతరులతో పోటీ పడకూడదు :- (donot compete)

ఇతరులతో పోటీ పడకపోవటం భగవంతుని గౌరవించినట్లు అవుతుందా అంటే ఖచ్చితంగా అవుతుంది. ఎలాగో తెలుసుకుందాం. వాళ్ళలాగా నేను అవ్వాలి, వాళ్ళకి వున్నది నాకూ కావాలి అని నీలో ఇతరుల పట్ల భావనలు కలుగుతుంటే యజమాని వారి దగ్గర ప్రశాంతంగా పనిచేసుకోలేరు కాదా? వారి దగ్గర యజమాని పని తీరు నీ కంట పడకుండా కాపాడుకోవాల్సి వస్తుంది. అంటే యజమాని ఆయన పద్ధతిలో పని చేసుకోవడానికి జీవి అడ్డువెళ్ళినట్లేగా?

అసలు ఎదుటి మనిషి కర్మవల్ల వచ్చిన comfort నిఅనుభవిస్తున్నారో భగవంతుని దయ వల్ల వచ్చిన comfort ని అనుభవిస్తున్నారో మనకు తెలీదుక కదా అలాంటప్పుడు వారి comfort తో మనం ఎలా పోటీపడతాం? ఎదుటి మనిషి కర్మలోని భోగాలు అనుభవిస్తుంటే మనం వారితో పోటీపడితే దాని అంతరార్థం ఏమిటి. మనం వారి కర్మను అనుభవించడానికి పోటీ పడుతున్నట్లేగా? ఎంత మూర్ఖత్వమో కదా!

అలాగే ఎదుటి మనిషి భగవంతునిదయ వలన వచ్చిన comfort నే అనుభవిస్తున్నారు అనుకుందాం! వారితో పోటీపడితే దాని అంతరార్ధం భగవంతుడు వారిని ఉద్ధరిస్తున్న పద్ధతిని మనమూ అనుసరించడానికి ఇష్టపడుతున్నట్లు కదా! ఆ పద్ధతి మనకు మేలు చేస్తుందో లేదో మనకి ఏ పద్ధతిలో భగవంతుడు ఉద్ధరించాలనుకున్నారో కదా? మన పోటీ వల్ల భగవంతుని పనికి అడ్డు వెళ్ళినట్లు అవుతుంది కదా!

ఒక్కో జీవికి అతని మనసతత్వానికి తగ్గట్లుగా అతనికి వున్న బంధాలు కర్మలకి తగ్గట్లుగా అతనిచేత భగవంతుడు అనుభవింపచేయదల్చుకున్న విషయాలకి తగ్గట్లుగా ఆ జీవికి యజమాని తనదైన పద్ధతిని ఎంచుకుంటారు ఆ పద్ధతి ఒక్కో జీవికి ఒక్కో లాగ work out చేస్తారు మరి మనం ఇతరులతో పోటీ పడితే మనకోసం యజమాని సిద్ధం చేసుకున్న plan మనకి work out లోకి రాదుకదా!

ఒకరిని నడిపించి తీసుకువెళ్ళితే మరొకరిని rope way లో తీసుకువెళ్తారు అసలు ఇంకొకరిని ఆయనే ఎత్తుకు తీసుకువెళ్తారు అలా ఎందుకు చేస్తారో యజమాని లెక్క యజమానికి వుంటుంది. మనం ఆ పద్ధతులను చూసి యజమానిని అంచనా వేయకూడదు. ఎదుటి వారి పద్ధతులతో పోటీ పడి యజమానికి అడ్డు రాకూడదు. యజమానిని అంచనా వేసినా యజమానికి అడ్డు వచ్చినా వారిని గౌరవించనట్లే! ఒకరు చేసే పనికి అడ్డు పడటం కన్నా అగౌరవం ఇంకోటి వుంటుందా?

ఇతరులతో comfort విషయంలోనే కాదు ఇంక ఏ ఇతర విషయాలలో కూడా పోటీ పడకుండా వుండాలి. ఒక జీవి దగ్గర భగవంతుడు ఏమి చేస్తున్నారో దానిని జరగనివ్వటమే యజమానిని గౌరవించినట్లు. మనం పోటీ పడితే మన దగ్గర పని ఆగిపోతుంది ఎదుటి వారి దగ్గరా పని ఆగిపోతుంది తద్వారా యజమానికి అడ్డుతగులుతున్న వాళ్ళం అవుతాం. పోటీ పడకుండా యజమానిని గౌరవిస్తే ఆ గౌరవానికి తగ్గట్లు యజమాని పని తీరు మన దగ్గర జరుగుతుంది. యజమాని పని తీరే మందిరానికి మొదటి స్తంభము. ఆ యజమాని పని తీరుకు, పోటీ పడకుండా మనమిచ్చే గౌరవమే ఆధారం కాబట్టి ఆ "గౌరవాన్నే" మొదటి స్తంభంగా చెప్పుకుంటున్నాం.

ఈ రోజు మనం మాట్లాడుకుంటూ తెలుసుకుంటున్న విషయం మామూలు విషయం కాదు మహా మంత్రం లాంటిది. ఎవరైతే యజమానికి గౌరవాన్ని ఇవ్వరో ఎప్పుడూ నువ్వా నేనా అని ఇతరులతో పోటీపడుతారో వారిలో మొదటి స్తంభం ఏర్పడదు అంటే మందిరం ఎప్పటికీ కట్టబడదు. అందుకనే మొదటి స్తంభం ఏర్పడటానికి మూల మంత్రం "యజమానిపై వున్న గౌరవం" ఆ గౌరవం కూడా వారు చెప్తున్న విధానంలో వుండాలి. ఈ రోజుకు ఇది చాలు ఎందుకంటే ఇది చిన్న విషయం లాగా వున్న ఆచరణలో జీవికి బహు కష్టమైనది. జీవి పుట్టిన దగ్గర నుంచీ తోబుట్టువులతో, జీవిత భాగస్వామితో, ఇరుగు పొరుగు వారితో, ఆఖరికి భగవంతునితో కూడా పోటీ పడటానికి అలవాటు పడిపోయింది. ఆ అలవాటు పోవాలంటే విషయాన్ని పూర్తిగా అవగాహన చేసుకోవాలి దానికి సమయం కావాలి కాబట్టి ఈ రోజు ఇంక భాషణం ఆపి ఇతరులతో పోటీపడకూడదు అన్న నిజాన్ని జీర్ణించుకోవటానికి కేటాయిద్దాం!

"నాకు ఒక చాక్లెట్ కావాలి బాబా!" అని భగవంతుని అడిగినా తప్పులేదు అది జీవి బలహీనతగా గుర్తించిన యజమాని చాక్లెట్ ఇవ్వటం ద్వారా జీవికి హాని జరగదు అనుకుంటే ఇస్తాడు లేదంటే అది జీవికి సరిపడదు అన్న విషయాన్ని జీవికే అర్థం చేయిస్తూ ఆ బలహీనతను తీసేస్తారు. కానీ చాక్లెట్ కావాలి అని అడగటం వెనకాల కారణం ఇతరుల దగ్గర ఆ చాక్లెట్ వుండటమో లేక ఎవరి దగ్గర లేదు కాబట్టి నా దగ్గర వుండాలి అన్న భావనో అయితే మాత్రం చాక్లెట్ అడగటం పోటీ పడటమే అవుతుంది యజమానికి గౌరవం ఇవ్వనట్లే అవుతుంది.

ఈ రోజుకి ఆఖరు మాట మందిరానికి మూల స్తంభం యజమాని పని తీరు, ఆ పని తీరు సవ్యంగా వుండాలంటే దానికి ఆధారం మనకి యజమానిపై వున్న గౌరవం, యజమానిని గౌరవించడం అంటే ఇతరులతో పోటీ పడకుండా వుండటం.

3వ రోజు

నిన్న మందిరానికి కావల్సిన మొదటి స్తంభం వేసుకున్నాము కదా! ఈ రోజు రెండో స్తంభం వేసుకుందాం! రెండో స్తంభం యజమానిపై **"విశ్వాసం"** విశ్వాసము అంటే మాకు ఎందుకు తెలియదు మేము అసలు బతుకున్నదే భగవంతుడు వున్నాడు ఆయనే చూస్తాడు అన్న విశ్వాసంమీద అంటారేమో! మనము విశ్వాసము అనుకుంటూ maintain చేసుకుంటున్న భావము వేరు అసలైన విశ్వాసపు అర్థము వేరు అది ఏమిటో తెలుసుకునే ప్రయత్నం చేద్దాం.

ఇతరులతో పోల్చుకోక పోవటమే విశ్వాసము (donot - compare) ఇతరులతో పోల్చుకోక పోవడమే విశ్వాసము ఎలా అవుతుందో తెలుసుకుందాం.

ఇతరుల దగ్గర వున్న మంచి నీకు కనిపించి దానికి కారణం వారి పుణ్య కర్మము లేక యజమాని దయ అని నీకు అనిపిస్తే నీవు అవిశ్వాసివే! అదేంటి వారికి జరుగుతున్న మంచికి కారణం యజమాని దయ అనే అంటున్నాను కదా అది అవిశ్వాసము ఎలా అవుతుంది అని నువ్వు అంటే దానికి యజమాని సమాధానము ఏమిటో విను. "అసలు నీకు ఎదుటి వారి మంచి ఎందుకు గమనింపువచ్చింది? వారి భోగ భాగ్యాలు సుఖాలు ఎందుకు గమనింపుకు వచ్చాయి? నన్ను మాత్రమే చూడాల్సిన కంటితో వాటిని ఎందుకు చూసావు? వెదజల్లబడుతున్న నా ఖజానా లోనిది కదా! దాని మీద నీ చూపు వచ్చిందంటే నా ఖజానా మీద నీ కన్ను పడిందిగా! ఖజనా మీద చూపు పడిన వాడిని నేను ఎలా నమ్ముతాను?" అంటారు యజమాని.

దానికి జీవి "బాబా! నేను ఆ భోగభాగ్యాలని నీ దయగా గుర్తించాను కానీ నాకూ కావాలని పోటీ పడలేదు కదా నేను ఎలా అవిశ్వాసిని అవుతాను?" అని అడిగితే దానికి యజమాని సమాధానం :- "దయ అనుకుంటూ నా ఖజానాపై పడిందే నీ చూపు ఆ చూపే నీలో అవిశ్వాసానికి మొదటి మెట్టు, నీకు కేవలం నేను కనబడాలి నాది కనబడకూడదు. నా దయని క్షమని గుర్తించాలంటే ఒక క్రియతోనే గుర్తించాలా? ఏమీ లేనప్పుడు ఏమీ జరగనప్పుడు కూడా నేను దయామయుడినేగా! నన్ను విశ్వసించటానికి ఇప్పుడు నా క్రియే నీకు ఆధారం కదా! అది ఎలా విశ్వాసమవుతుంది. నా క్రియ కనపరిచిన నాడు నా దయని చూస్తే క్రియ కనపడని నాడు నా దయని చూడలేవుగా. క్రియ లేకుండా వుండగల్గే సత్తా నాది క్రియ లేకుండా కూడా నన్ను గుర్తించగల్గే సత్తా నీది అయితేనే నువ్వు విశ్వాసివి. బాగా గడిచిన రోజు బాబా దయ అంటే గడవని రోజు దయలేదని నువ్వు అన్నట్లేగా అవిశ్వాసి," అంటారు బాబా.

అలాగే ఇతరులు పడుతున్న కష్టాలు చూసి బాబా ఎందుకు పెట్టారో అలా అని జీవి అనుకుంటే వారి కష్టాలకి బాబాని బాధ్యులను చేసినట్లేగా! అంటే భగవంతుడు కష్టపెడుతున్నారని, కష్టపెట్టేవారని నువ్వు ఒప్పుకున్నట్లేగా! అది భగవంతుడే రక్షకుడని నీ విశ్వాసముకు దెబ్బ కదా! వాళ్ళ కష్టాలు నాకు లేవు అంతా యజమాని దయ అనుకుంటే మళ్ళీ ఆయన దయ మీదకి చూపు వెళ్ళినట్లే అంటే ఆయన ఖజానా మీద కనున్నపడినట్లే ఇలా ఇతరులతో ఏరకంగా పోల్చుకున్నా అది జీవికి అవిశ్వాసమే!

బాబోయ్ ఇదేం జుట్టు పీకుడు అవునన్నా తప్పే కాదన్నా తప్పే ఇలా అయితే ఎలా? అసలు ఏది తప్పు? ఎందుకు తప్పు? సరిగ్గా చెప్పు అంటే యజమాని సమాధానం :– అసలు ఇతరుల మంచిని కానీ చెడును కానీ నీతో పోల్చుకోవటం తప్పు ఎందుకంటే ఇతరుల మంచిని గమనిస్తున్న నువ్వు నిదానంగా ఆ మంచినే పోగుచేసుకోవటానికి అలవాటు పడతావు. అంటే ఆ మంచిని పొందే దిశగానే వెళ్తావు. అంటే భగవంతుని ఆశీర్వాదాలను పోగు చేసుకుంటూ పోతావు అంటే చివరికి నీ బుట్టలో వుండేవి కొద్ది పాటి ఆశీర్వాదాలేకానీ భగవంతుడు కాదు. ఆశీర్వాదము అంటే భగవంతుడితో continuous connection కదండీ అని నువ్వు అంటే :– భగవంతుడితో connection అన్నది సరే! బుట్ట వుంది దాని నిండా ఆశీర్వాదాలు వున్నాయి అవి అనుభవించడానికి నువ్వు సదా వుండాలి కదా! భగవంతుడు వుంటాడు ఆశీర్వాదం వుంటుంది అనుభవించటానికి నువ్వు వుండవుగా నువ్వు నిత్య జీవివి కాదు కాబట్టి నీకు కాల పరిమితి వుంది. నువ్వు నిత్యజీవివి అవ్వాలంటే నువ్వు మందిరానివి కావాలి నీలో విశ్వాసం అనే స్తంభం లేదు కాబట్టి నువ్వు మందిరానివి కాలేవు. మరి ఇప్పుడు చెప్పు ఆశీర్వాదము మాత్రమే పోగేసుకుంటే ఏమి లాభము?" అని యజమాని అంటారు.

"మరి ఇప్పుడు ఏమి చేయాలి? ఎలా వుండాలి?" అని నీవు అంటే దానికి యజమాని సమాధానం :–

అసలు ఇతరుల మంచి చెడులు ఏమీ గమనించకు వాటిని స్పందించకు. React కాకుండా వుండలేను అంటే గమనించటం మానేయ్. అసలు గమనించకుండా వుండలేను అంటే నీ ఖర్మ నేను ఇంక ఏమి చేయలేను. ఒక దశదాకా గమనించినా ఊరుకున్నాము ఇంక ఇప్పుడు ఇతరుల మంచి చెడులు గమనించి స్పందించకు (react కాకు). లేదంటే నీకు కేవలం భగవంతుని మహిమే పరిచయం అయి భగవంతుని ఆశీర్వాదాలు collect చేసుకోవడమే అలవాటు అవుతుంది కానీ భగవంతుడు పరిచయం కాదు.

ఎంత సునిశితమైన విషయం విశ్వాసమంటే. కష్టము వస్తే భగవంతుడు వున్నాడు ఆదుకుంటాడు అనుకోవటం సుఖము వస్తే భగవంతుడు ఇచ్చాడు అనుకోవటం విశ్వాసము కాదు. అసలు కష్ట సుఖాలు దేనికి స్పందించకపోవటం దేనినీ గమనించకపోవటం విశ్వాసం. తొలి దశలలో కష్టంలో సుఖంలో భగవంతుని గుర్తించటం విశ్వాసం అంటే ఇప్పుడు అసలు కష్టసుఖాలను గుర్తించకపోవటం విశ్వాసం అనిపించుకుంటుంది. ఇలాంటి విశ్వాసం రావాలంటే ఇతరులతో పోల్చుకోకూడదు. ఇక్కడ ఇతరులు అంటే మన నిన్నటి రోజు కూడా ఈ రోజుకి ఇతరమైనదే. అంటే మన గతాన్ని ప్రస్తుతంతో, భవిష్యత్తుతో పోల్చుకుని ఇది వరకు బాగుంది బాలేదు అని ఏమీ అనకూడదు. un reactable గా వుండాలి అని ఒక్క ముక్క చెప్పొచ్చుగా ఈ సోది ఎందుకు? అంటే :- unreactable గా వుండాలి జీవి react అవ్వాల్సిన చోటకూడ react కాదు భగవంతుడి విషయాలకు react కానట్లే భగవంతునికి కూడా react కాదు అదీ danger కదా! ఎక్కడ unreactable గా వుండాలో అక్కడ మాత్రమే అలా వుండాలి అందుకే ఇంత detail explanation అవసరమైంది.

ఈ రోజుకి ఆఖరు మాట:-

మందిరానికి రెండో స్తంభం భగవంతుని మీద విశ్వాసం, ఆ విశ్వాసానికి ఆధారం ఇతరులతో పోల్చుకోకపోవటం. ఇతరులతో పోల్చుకుంటూ పోతే భగవంతుని మహిమకు అలవాటు పడి ఆశీర్వాదాలే పోగుచేసుకుంటాం కానీ భగవంతునికి అలవాటు పడి ఆయనని నింపుకోము తద్వారా నిత్యజీవిగా మారము.

4వ రోజు

మందిర నిర్మాణం బాగా జరగాలంటే యజమాని పని తీరు బాగా జరగాలి ఆ పని తీరుకు జీవి స్పందించకూడదు అంటే గౌరవాన్ని, విశ్వాసాలను స్తంభాలుగా కలిగి వుండాలని తెలుసుకున్నాం. ఈ రోజు ముచ్చటగా మూడో స్తంభాన్ని నిర్మించుకుందాం. మూడో స్తంభం "జీవి యజమానికి అందించే సహకారం". యజమాని అంతటి గొప్పవారికి జీవి అందించే సహకారం ఏమి వుంటుంది? అంటే యజమానికి ఏ ఫిర్యాదులు (complaints) చేయకుండా ఏ ఎదురు ప్రశ్నలు వేయకపోవటమే జీవి అందించే సహకారం.

జీవి "నువ్వు ఈ పద్ధతిలో వెళితే నాకు ఈ ఇబ్బంది బాబా" అని పిర్యాదు చేసిందనుకోండి ఆ పద్ధతిలోనే ఎందుకు వెళ్ళాలో ఆ పద్ధతి జీవికి ఎలా మేలైందో వివరించాల్సివస్తుంది. యజమానికి దాని ద్వారా జీవి time waste అవుతుంది. సందేహం వస్తే నివృత్తి చేసేందుకు time పడుతుంది. ఏదైనా ఆసక్తి వస్తే దానిని తీర్చేందుకు time పడుతుంది. ఇలా complaints కి, సందేహాలకి, ఆసక్తిలకి అన్నిటికీ సమాధానాలు చూపిస్తూ వుంటే యజమాని పని ఆగిపోతుంది జీవి time waste అవుతుంది.

ప్రశ్న రాగానే సమాధానం వస్తోంది, ఈ పద్ధతిలో వద్దంటే బాబా తన పద్ధతిని మారుస్తున్నారు అంటే బాబాకి నాపై వున్న ప్రేమ కదా అని జీవికి అనిపించవచ్చు. ప్రేమ సరే OK! ప్రేమనే అనుభవిస్తూ కూర్చుంటే పుణ్యకాలం అయిపోవట్లా? అసలు పని భగవంతునిగా మారే పని భగవంతుని మందిరంగా మారే పని ఆగిపోవట్లా? నీకు సమాధానం చెప్పటమే యజమానికి నీపై వున్న

ప్రేమ అనుకుంటున్నావు అమాయకంగా! సమాధానం చెప్తే అయినా ముందుకు కదిలి ఆయనకు సహకరిస్తావు అని ఆయన తొందర పడుతుంటారు, అది గుర్తించాలి జీవి.

ఇప్పుడు జీవి time waste కాకుండా వుండాలి అంటే :- తనకి ప్రశ్నలని, అనుభవాలని, సమాధానాలని తనే పట్టించుకోకూడదు అప్పుడు ప్రశ్న సమాధానం అన్నీ ఆగిపోతాయి. అదేంటండి ప్రశ్న సమాధానం రెండూ జీవిలోనే వుండాలి అన్నారుగా అంటే ఇంక అదే పనిగా వ్యాపారం చేయమని అనలేదుగా అంటారు యజమాని. యజమాని నడిపింపులోని సాధక బాధకాలను కూడా అధిగమించాలి. “పడలేని బాధ అయితే నేను ఓర్చుకోలేనిది అయితే బాబా నన్ను ఈ పర్ధతిలో ఎందుకు నడిపిస్తారు? బాబా ఈ పద్ధతిలో నడిపిస్తున్నారంటే ఇదే నాకు మేలు చేస్తుంది” అని అనుకుంటే సగం ఇబ్బంది పోతుంది.” బాబా ఈ పద్ధతిలో నడిపిస్తున్నారంటే ఇది సత్యమైనది సత్యం ఎప్పుడూ ఇబ్బంది కలిగించదు అంటే నాకు కలుగుతున్న ఈ అసౌకర్యం తాత్కాలికమైనదే శాశ్వతం కాదు అంటే భ్రమే” అన్న అవగాహన వుంటే మిగతా సగం ఇబ్బంది పోతుంది.

లేదంటే బాబా ఏ పద్ధతిలోకి మార్చినా జీవి ఇబ్బంది పడి సహకరించదు. బాబా జీవి uplift లో భాగంగా ప్రార్ధించమంటారు కొంతకాలానికి ప్రార్ధించొద్దు అంటారు, ప్రేమించవద్దు అంటారు ప్రేమగా వుండమంటారు, subject నేర్చుకోమంటారు ఆ పిచ్చే పట్టకూడదంటారు, వీటన్నిటిలో జీవి ఇబ్బంది పడి యజమానికి ఫిర్యాదు చేసినా ప్రశ్నించినా

వృద్ధి ఆగిపోతుంది time waste అవుతుంది. అందుకే పై అవగాహన వుంటే ఇబ్బందిని అధిగమించవచ్చు తద్వారా బాబాకు ఫిర్యాదు చేయకుండా వుంటూ సహకారాన్ని అందించవచ్చు.

జీవి తనకు నచ్చినట్టుగా comfort గా వుంటేనే భగవంతుడినైనా ఒప్పుకుంటుంది లేదంటే భగవంతుడినైనా పక్కన పెడుతుంది పై పెచ్చు భగవంతుడు ఇబ్బంది పెట్టేవాడు కాదు కదా అని ఉపన్యాసాలు ఇస్తుంది. దాంతో బాబా వీడిని బాగు చేయమని ప్రకృతికో మరో దానికో చెప్తారు అంటే ఆయన పద్ధతిలో కాక మరో పద్ధతిలో ఉద్ధరిస్తారు. ఆయన పద్ధతి కానిది మాయే కదా! యజమాని అనబడే ఏకైక శిల్పి చేతిలోనే చెక్కబడాలి కానీ ప్రకృతి, మాయ అనబడే ఇతర శిల్పుల చేతిలోకి ఎందుకు వెళ్ళాలి?

యజమానేమి తనంతట తనుగా మనలను ఇతరులకు అప్పగించరు మనము ఇబ్బందిగా feel అయి గింజుకుంటేనే మన మూర్ఖత్వానికి నొచ్చుకుంటూ మరీ మనలను ఇతరులకు అప్పగిస్తారు.

ఈ రోజుకి ఆఖరు మాట :-

యజమానికి జీవి ఇచ్చే సహకారం మూడో స్తంభం సహకారం అంటే యజమాని పద్ధతికి ఇబ్బందిగా feel కాకపోవటం, ఫిర్యాదు చేయక పోవడం, అడుగడుగునా ప్రశ్నించి అడ్డుపడక పోవటం.

5వ రోజు

మందిరానికి కావల్సిన ఆఖరి స్తంభము అనగా నాలుగో స్తంభం గురించి తెలుసుకుందాం! మందిరానికి కావల్సిన నాలుగో స్తంభం **శూన్యం.**

శూన్యమా! అదేంటి యజమాని నిత్య జాగృతి స్వరూపుడు కదా! శూన్యముగా ఎందుకు వుండాలి ఇలా పలు ప్రశ్నలు వింటున్నవారికి వస్తూవుండొచ్చు. శూన్యమంటే యజమాని ఉద్దేశము ఏంటో చూద్దాం!

జీవికి జీవ లక్షణాలు వున్నా వాటి ప్రభావం జీవిపై శూన్యంగా వుండాలి అంటే వుండకూడదు. జీవికి ఇంద్రియ లక్షణాలు, అరిషడ్ వర్గాలు ఎన్నైనా వుండొచ్చు గాక యజమాని పని చేసుకుంటున్నప్పుడు వాటి ప్రభావం వల్ల పని ఆగకూడదు ఇది నేర్చుకుంటే చాలు ఇంద్రియాల మీద పట్టు అరిషడ్వర్గాల మీద పట్లు సాధించటం కోసం జన్మ వృధా చేసుకోవక్కర్లేదు. యజమాని ప్రభావాన్నే ఒప్పుకుంటే జీవి ప్రభావం జీవిపై క్రమేణా శూన్యమవుతూ వస్తుంది.

అలాగే ఆత్మ లక్షణాల ప్రభావం జీవిపై శూన్యంగా వుండాలి. యజమాని పట్ల ప్రేమ కలిగి వుండాలి ఆ ప్రేమ ప్రభావం జీవిపై శూన్యంగా వుండాలి. లేదంటే ప్రేమ ప్రభావంలో వున్న జీవి ఏకం అన్న స్థితిలో మనలేదు స్వతంత్రాన్ని ఆస్వాదించలేదు కదా! యజమాని సేవ చేయాలి సేవ ప్రభావం జీవిపై శూన్యంగా వుండాలి. సేవ వల్ల వచ్చే కీర్తి ప్రతిష్టలకి మరిగిందంటే సేవకుడిగానే వుండిపోతుంది జీవి. చేయించేది చేస్తోంది యజమానే నేను పనిముట్టునే అన్న భావం వుంటే జీవిపై సేవ ప్రభావం శూన్యమవుతుంది. నిజలక్షణాలు నిజంగదా అని వాటినే maintain చేసుకుంటే అన్నీ వదిలి అతీతంగా వుండటం రాదు జీవికి, కాబట్టి నిజ లక్షణాలు వుండాలి కాని

వాటినే maintain చేసుకుంటూ వుండక్కర్లేదు, యజమాని చెప్పినట్లు వింటే చాలు అప్పుడు నిజ లక్షణాలు అవే వుంటాయి అనుకున్నప్పుడు నిజ లక్షణాల ప్రభావం కూడా జీవిపై వుండదు.

బాబా ఎప్పుడు ఎలా వుండమంటే అలా వుండటమే నిజ మనుకున్నప్పుడు తెలియబడ్డ నిజ ప్రభావం జీవిపై శూన్యం యజమాని ప్రభావాన్నే జీవి ఒప్పుకుంటున్నా ఆయన మహిమ, కీర్తి, ఆనందం, భోగం, ఐశ్వర్యం, ఖజానా లాంటి యజమాని విషయాలకి జీవి ప్రాధాన్యత ఇవ్వకపోవడం వల్ల యజమాని విషయాల ప్రభావం కూడా జీవిపై శూన్యమే. ఆయన వల్ల వచ్చే భోగ భాగ్యాలు స్థితి గతులు కీర్తి ప్రతిష్టల కంటే ఆయనే అధికుడు, నిలుపుకోవాల్సింది ఆయనను, నిలవాల్సింది ఆయనతో అన్న జీవి అవగాహన వల్ల జీవిపై ఆయన ఖజానా ప్రభావం శూన్యం. నిలుపుకోవాల్సినది ఆయనని కాని ఆయన ఇచ్చింది కాదు అన్న జీవికి వున్న అవగాహనవల్ల దొరికిన లాభాల ప్రభావం జీవిపై శూన్యం.

ఈ రోజుకి ఆఖరి మాట :-

జీవి జీవ లక్షణాలను, భగవత్ లక్షణాలను, నిజ లక్షణాలను, ప్రేమను. సేవను, ఖజానాను, లాభాలను, యజామనిని ఆయన విషయాలను అన్నీ కలిగివుండాలి కానీ ఆ అన్నింటి ప్రభావం మాత్రం జీవిపై వుండకూడదు. వాటి ప్రభావం జీవిపై శూన్యంగా వుండాలి. ఆ శూన్యమే మందిరానికి నాలుగో స్తంభము. యజమాని ప్రభావాన్నే మనం ఒప్పుకోవాలి ఆయన ఎక్కడ ప్రభావితం చేయాలో అక్కడ ప్రభావాన్ని చూపుతూ ఎక్కడ స్వతంత్రంగా నిలపాలో అక్కడ నిలుపుతూ వుంటారు.

6వ రోజు

మందిరానికి నాలుడు స్తంభాలు ఏర్పడ్డాయి. పోటీ పడక పోవటం వల్ల గౌరవమనే స్తంభం, పోల్చుకోక పోవటం వల్ల విశ్వాసమనే స్తంభం, ఫిర్యాదులు లేక పోవటం వల్ల సహకారమనే స్తంభం, ప్రభావాలు లేక పోవటం వల్ల శూన్యమనే స్తంభం నిర్మించబడ్డాయి.

జీవి ఇతరులతో పోటీ పడట్లేదు, పోల్చుకోవట్లేదు, ఫిర్యాదులు చేయట్లేదు, ఇతరుల ప్రభావంలో వుండట్లేదు. జీవి యజమానినే గౌరవిస్తోంది. విశ్వసిస్తోంది, కేవలం యజమానికే జీవి తన సహకారాన్ని అందిస్తోంది, కేవలం యజమాని ప్రభావాన్నే జీవి ఒప్పుకుంటోంది. అంటే నిశితంగా పరిశీలిస్తే జీవి కేవలం యజమానితోనే సంబంధాన్ని కలిగి వుంది. కేవలం యమానితోనే కలిగి వున్న ఈ సంబంధం వల్ల అక్కడ శ్రద్ధ అనే పుష్పం వికసిస్తోంది. ఎడతెగని శ్రద్ధ (undivided attention) అనే పుష్పం వికసిస్తోంది.

ఈ వికసించిన పుష్పం ఎవరిని ఆస్వాదింపచేస్తోంది? ఎవరిని ఆనందింప చేస్తోంది? అంటే ఇంకెవరిని యజమానినే ఆనందింప చేస్తోంది. ఆయజమాని ఎక్కడ వున్నారు అంటే కేవలం యజమానినే గౌరవిస్తూ, విశ్వసిస్తూ, యజమానికి సహకరిస్తూ యజమాని ప్రభావంలో వున్న జీవిలోనే కదా!

అంటే ఆ నాలుగు స్తంభాల మధ్య అలరారుతున్న యజమానినే ఆస్వాదింపచేస్తోంది ఆ పుష్పము. అందుకే వికసించిన పుష్పం దాని వికాసాన్ని లోకానికి చూపట్లేదు స్తంభాల మధ్య దిన దిన ప్రవర్ధమానమవుతున్న యజమానికే దాని వికాసాన్ని చూపుతోంది. స్తంభాల మీద బోర్లించిన ఆకారంలో

వుంటోంది పుష్పము. అంటే కేవలం స్తంభాలు నిర్మించుకుంటే పై కప్పు దానంతట అదే ఏర్పడిపోయింది.

మందిర నిర్మాణం దాదాపుగా పూర్తి అయింది. నాలుగు స్తంభాలు ఏర్పర్చుకోగానే పై కప్పు దానంతట అదే ఏర్పడింది మందిరం ఏర్పడటమే కాక మందిరంలో శ్రద్ధ అనే సువాసన కూడా వెదజల్లబడుతోంది. ఆ సువాసన మందిరపు ఉనికిని చాటుతోంది.

ఈ రోజుకి ఆఖరి మాట :-

కేవలం యజమానితో కూడుకున్న జీవి dealing వల్ల ఎడతెగని శ్రద్ధ అనే పుష్పం వికసించి మందిరపు పై కప్పుగా మారిపోయి దాని పరిమళంతో యజమానిని అలరారిస్తోంది.

7వ రోజు

స్తంభాలతో, పై కప్పుతో మందిరం ఏర్పడిపోయింది. ఇప్పుడు ఆ మందిరంలో యజమాని ఆ శ్రద్ధ పరిమళపు ఆస్వాదనకు స్వయంగా ఉద్భవిస్తూ వుంటారు. పూర్తిగా మందిరపు వాతావరణం అంతా యజమాని మయంగా మారిపోతుంది.

మందిరంలో ప్రతీ విషయం తేటతెల్లగా విప్పబడుతుంది. మర్మము అనేది మందిరంలో గంటలాగా మోగుతూ వుంది. సమస్తమూ తేటగా పైకి తేబడుతూ వుంటుంది.

మందిరంలో మోగుతున్న మర్మపు ధ్వనులకు సమస్త శత్రుసైన్యం ఓటమిని ఒప్పుకుని జీవికి లొంగిపోతాయి. శత్రుసైన్యమంటే జీవికి వున్న సందేహాలు, ఆశలు, ఆశయాలు, గమ్యాలు, లక్ష్యాలు సొంత అవగాహనలు, సొంత స్పందనలు, సొంతమైన మంచి చెడు కర్మలు అన్నీ కూడా తేట తెల్లంగా బయలు పడుతున్న మర్మము ముందు తామే అల్పులుగా ఒప్పుకుని నిర్వీర్యం అవుతాయి.

అంటే మందిరానికి శత్రువుల భయం, దోపిడీ దొంగల భయం లేదు. మందిరానికి నష్టం చేసేవారే లేరు. కాబట్టి మందిరానికి గోడలు తలుపులు, గడియలు, తాళాలు, తాళపుచెవులు ఏమీ అక్కర్లేదు. సగానికి సగం పని తగ్గిపోయింది.

కేవలం పాత గోడలు కూల్చి పునాది వేసుకుని స్తంభాలు కట్టగానే పైకప్పు దానంతట అదే ఏర్పడింది. శ్రద్ధ అనబడే పై కప్పు పరిమళాన్ని ఆస్వాదించటానికి మందిరంలో యజమాని ఊట లాగా ఊరిపోతున్నారు. అక్కడ బయటపడుతున్న మర్మపు ప్రభావానికి మాయ పారిపోయింది. సమస్తమూ ఆ మందిరంలోని యజమానికి లొంగిపోయింది. దాంతో గోడలే అక్కర్లేకుండా పోయాయి. కేవలం ఎడతెగని శ్రద్ధ ఇంత పనిని చేసింది. ఆ శ్రద్ధకే భగవంతుడు మురిసిపోయి పొంగి పొర్లుతున్నారు.

అసలు ఆయనే పొంగిపొర్లుతుంటే కొందరు వారు తోక ముడుచుకోవాల్సిందేగా! అమృతం లాంటి ఈ మాట ఒక్కటి చాలు ఈ రోజుకి అనవసరమైన వ్యాఖ్యానాలతో ఈ taste పోగొట్టుకోకూడదు ఎవరమూ కూడా!

8వ రోజు

మందిరం పూర్తిగా నిర్మింపబడిపోయింది. శ్రద్ధ కోసం యజమాని, యజమాని వల్ల మర్మము ఊరుతున్నాయి. మర్మముకి సమస్తమూ లొంగి పోయింది. కదా!

అంటే మందిరంలో వున్న యజమాని జీవిని ఎవరి బారినుంచీ రక్షించక్కర్లేదు. జీవిని పాలించక్కర్లేదు. అసలు జీవిలో ఇప్పుడు లయం చేయాల్సిన ఇతర విషయాలే లేవు. జీవికి యజమాని సేవ చేయక్కర్లేదు. యజమాని చేత జీవి సేవచేయించుకోవక్కర్లేదు. జీవి చేరాల్సిన గమ్యము ఇంక ఏమీ లేదు కాబట్టి జీవికి మార్గదర్శిగా వ్యవహరించాల్సిన పని లేదు యజమానికి.

యజమాని రక్షకుడిగా, పాలకుడిగా, లయకారకుడిగా, సేవకుడిగా, మార్గదర్శకుడిగా ఇలా ఏదో ఒక లాగా వుండక్కర్లేదు. యజమాని యజమానిలాగా దర్జాగా వుంటారు ఈ మందిరంలో.

యజమాని ఎంతలాగా ఉప్పొంగుతారంటే ఆయన పొంగులో మందిరంలో జీవి నిలుపుకున్న గౌరవం, విశ్వాసం, సహకారం ఆఖరుకు శ్రద్ధ అన్నీ కూడా యజమాని రంగులోకి మారి యజమాని రుచినే సంతరించుకుంటాయి. అంటే జీవి దాని శ్రద్ధ కూడా అన్నీ యజమాని మయం అయిపోతాయి.

ఇతరులకు మందిరంలోని యజమానే కనబడతారు కానీ దానికి ఆధారమైన జీవి జీవి యొక్క శ్రద్ధ కనపడవు. కేవలం యజమానే ఆ జీవిని దాని శ్రద్ధని వేరుగా గుర్తించగల్గుతారు ఎందుకటే ఆయన ఆస్వాదన అదే కదా!

ఇలా కేవలం యజమానే మిగులుతారు మందిరంలో ఇప్పుడు మందిరపు పునాది, స్తంభాలు, పైకప్పు అంతా యజమానే. అంటే మందిరమూ ఆయనదే, మందిర నివాసీ ఆయనే.

ఆయన ఆ మందిరంలో తన హోదాను దర్జాను దేనినీ కోల్పోవాల్సిన పని లేదు. ఆయన ఆయన లానే వుంటారు సేవకుడిగా, ప్రేమికుడిగా, గురువుగా, భగవంతుడిగా దేనిగానూ మారక్కర్లేదు. అక్కడ ఇంక క్రమేణా యజమానే పెరిగి పెరిగి మందిరము కూడా కనబడదు. యజమాని పరిఢవిల్లటానికి ఆధారమైన మందిరం కూడా యజమానిని గ్రహిస్తూ గ్రహిస్తూ గ్రహిస్తూ యజమానిలాగే మారిపోతుంది. ఏమీ రెండోది వుండదు. కేవలం యజమానే వుంటారు. మందిరమూ, మందిర నివాసీ, మందిర రహితముగా కేవలంగా వున్నది ఆయనే.

యజమానిని యజమాని దర్జాలో వుంచిన జీవి యజమానే, ఆయనలోని భాగమే. ఈ స్థితిలో ఏమీ మిగలదు. అంతా ఒకే రకంగా వ్యాపించివున్న (uniform) యజమాని తప్ప! ప్రతీ జీవి ఇలా వుండాలన్నదే యజమాని ఉద్దేశం.

ఆ వున్న యజమానిని వుండనిస్తూ ఆ ప్రవాహంలో ఏ అల ఎదురైతే దానికి సాక్షిగా అది ఇచ్చే భోగానికి సాక్షిగా వుండటమే మిగిలింది. నిజానికి ఇక్కడ అంతా ఒకటే కాబట్టి సాక్షి కూడా పూర్తి స్థాయిలో వుండదు. అంటే భోగము, భోగింప చేసేది, భోగింప పడేది ఒకటే.

సమస్తమూ కలిగి వున్న యజమానే సమస్తమూతో నిండి వుండి అలరారుతుంటారు.

**మందిరమా జై!**

**మందిర నివాసీ జై!**

**మందిర రహితా జై!**

**అఖండ పరిపూర్ణ పరబ్రహ్మా జై!**

**– గిరిధర్‌వాణి ఆనందనందనం**

# ప్రార్థన

సమస్తాన్ని తనలో కలిగి వుండి సమస్తమూ నిండి వున్న అఖండ పరిపూర్ణ పరబ్రహ్మను నా యజమానిగా స్వీకరిస్తున్నాను.

సర్వాధారుడైన నా ప్రభువు నిరాధారంగా నాపై కృపను వర్షిస్తున్నారని విశ్వసిస్తున్నాను.

నా సమస్తానికి ప్రభువు అయిన అఖండ పరిపూర్ణ పరబ్రహ్మకు నా కృతజ్ఞతలు.